క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు కానుకల అందజేత



స్వాములకు కానుకలు అందజేస్తున్న ఉమర్

ఇబ్రహీంపట్నం: శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాములకు చిరుకానుకలను అందజేసి మత సామరస్యాన్ని చాటుకున్నాడు ఓ ముస్లిం సోదరుడు. ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లికి చెందిన అయ్యప్ప స్వాములు మంగళవారం శబరిమలై యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన మహమ్మద్ ఉమర్.. అయ్యప్ప స్వాములకు తన సొంత ఖర్చులతో అరటిపండ్లు, వాటర్ బాటిల్, రూ.21 నగదు అందజేశాడు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని.. సాటి మనిషికి ఎల్లవేళలా సాయం చేయాలని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని కోరారు.

మురుగు సమస్య పరిష్కరించండి



తుల్జాభవానీ రోడ్డుపై పారుతున్న మురుగు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని తుల్జాభవానీ కాలనీలో నెల రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని.. వృద్ధులు, చిన్నారులు రోగాలబారిన పడుతున్నారని అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రవీణ్‌రావుకు శుభాకాంక్షలు



ప్రవీణ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హోంగార్డులు

తుర్కయంజాల్: రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ప్రవీణ్ రావును మంగళవారం రాష్ట్ర హోంగార్డుల సంఘం సభ్యులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచాల: మండలంలోని జాపాల ఉన్నత ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'సేవ్ నేచర్-సేవ్ ఫ్యూచర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. మొక్కల పెంపకం యొక్క ఆవశ్యకతను ఉపాధ్యాయులు.. విద్యార్థులకు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు బీమ్లా నాయక్, జహీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం ప్రజాభవన్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

మాడ్గుల: మండల కేంద్రంలోని నల్లచెరువు గ్రామానికి చెందిన రైతు జంగయ్య ఇటీవల విద్యుదాఘాతానికి గురై మాడ్గులలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మంగళవారం జంగయ్యను కలిసిపరామర్శించారు. కుటుంబ సభ్యులకుధైర్యం చెప్పారు. వక్తిగతంగా ఆర్థికసాయం అందజేశారు.

ప్రహరీలు నిర్మించరూ..

- మెజార్టీ పాఠశాలలకు రక్షణ కరువు
- రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కడ్తాల్‌లో ప్రహరీ లేని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

కడ్తాల్: కడ్తాల్ మండలంలోని మెజార్టీ ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువైంది. దీంతో ఆయా పాఠశాలలు చీకటి పడితే తాగుబోతులకు అడ్డాగా, మూగజీవాలకు నిలయంగా మారాయి. దీనికితోడు పాఠశాలల్లో నైట్‌వాచ్ మెన్‌ల నియామకం కూడా చేపట్టకపోవడంతో రాత్రిపూట పాఠశాలల ఆవరణల్లో అసాంఘీక కార్యకలాపాలు సైతం చోటుచేసుకుంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నయి. ఇదే అదునుగా కొందరు పాఠశాలల్లోని వస్తువులను ఎత్తుకెళ్తూ చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రిపూట పాఠశాలల మైదానాల్లో మద్యం సేవించడంతో పాటు ఖాళీ సీసాలు, వ్యర్థాలను పాడేస్తున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోవడంలేదు.

వస్తువులకు రక్షణ కరువు..

మండలంలో పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, డీఎస్‌టీ, ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే ప్రహరీల నిర్మాణం చేపట్టారు. మిగతా పాఠశాలల్లో ప్రహరీలకు తోడు కనీసం అటెండర్లు కూడా లేరు. ప్రత్యేకించి 450కు పైగా విద్యార్థులు గల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలోని వస్తువులకు రక్షణ కరువైంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాఠశాలలో కంప్యూటర్లు, ఇతర విలువైన సామగ్రి సమకూర్చినా రాత్రివేళల్లో వాటికి రక్షణ లేకుండా పోయింది. గతేడాది ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం చేపట్టడంతో పాటు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రహరీలు నిర్మించాలి



కడ్తాల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు, మండల పరిధిలోని అనేక పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఆవరణల్లో మూగజీవలు సంచరిస్తున్నాయి. దీంతో పాఠశాల పరిసరాలు దుర్గంధం అవడంతో పాటు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రహరీల నిర్మాణం చేపట్టాలి.

– భగీరథ్, బీజేవైఎం నేత, కడ్తాల్

మూగజీవాలు సంచరిస్తున్నాయి



పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు ఇష్టారీతిగా సంచరిస్తున్నాయి. వ్యర్థాలను మైదానంలో వదలడంతో పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా మారుతోంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలి.

– వంశీకిరణ్, 10వతరగతి, బాలుర ఉన్నత పాఠశాల, కడ్తాల్

అధికారుల దృష్టికి తీసుకువెళ్తా



పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. గతంలో పాఠశాల ఫర్నీచర్, సామగ్రి చోరీకి గురైంది. గతేడాది పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. రాత్రివేళలో వాటిని కూడా గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– జంగయ్య, హెచ్ఎం, బాలుర ఉన్నత పాఠశాల, కడ్తాల్

పెట్రోల్ బంకుల వద్ద బారులు



ఆమనగల్లు: పెట్రోల్ బంక్ వద్ద బారులుతీరిన వాహనదారులు

ఆమనగల్లు: ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగడంతో రెండు నుంచి మూడురోజుల పాటు పెట్రోలు, డీజిల్ లభించదని సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరగడంతో మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనదారులు బారులు తీరారు. దాదాపు అరకిలో మీటర్ మేర లైన్‌లో ఉండి పెట్రోలు పోయించుకున్నారు. సాయంత్రానికి ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించారని పెట్రోలు కొరత ఉండదని చెప్పినప్పటికీ వాహనదారులు మాత్రం క్యూలో ఉండి పెట్రోల్ పోయించుకున్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌ల వద్ద పెట్రోల్ బంకుల వద్ద బారులు భారీగా వాహనాలు నిలిచాయి. రానున్న మూడురోజులు బంకులు బంద్ ఉంటాయనే దుష్ప్రచారంతో పెట్రోల్ పోయించుకునేందుకు వాహనదారులు పెద్ద సంఖ్యలో బంకుకు చేరుకున్నారు. క్యూలో ఉండి వాహనాల్లో పెట్రోల్ పోయించుకున్నారు.



కడ్తాల్: మక్తమాధారం హెచ్‌పీ బంకు వద్ద..

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: పెట్రోలు, డీజిల్ సరఫరా చేసే ట్రక్కు డ్రైవర్లు సమ్మె బాట పట్టారనే వార్త మంగళవారం సోషల్ మీడియాలో, ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో మండల పరిధిలో పెట్రోలు బంకుల వద్ద మంగళవారం వాహనదారులు క్యూ కట్టారు. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోయించుకోవడంతో పాటు క్యాన్లలో, వాటర్ బాటిల్స్‌లలో పెట్రోలు తీసుకువెళ్లారు.

త్వరితగతిన బోరు పనులు పూర్తిచేయాలి

కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని శ్మశాన వాటికలో బోరు వేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చాలా కాలం క్రితం జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరైనా సాంకేతిక కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదన్నారు. శ్మశానవాటికలో నీరు లేకపోవడంతో అంత్యక్రియల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. స్పందించిన అధికారులు కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని ఆమె చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ బోరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలందరూ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్మశాన వాటిక అధ్యక్షుడు దయ్యాల వెంకటేశ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, సతీష్‌గౌడ్, రేణుకగౌడ్, మమత మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటికలో బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అయోధ్య అక్షితల పంపిణీ



హయత్‌నగర్: అక్షితలతో ఊరేగింపుగా వెళ్తున్న సభ్యులు

హయత్‌నగర్: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో హనుమాన్ సేవా వాహిణి ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య రామాలయం అక్షితల పంపిణీని ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి అక్షితలు పంపిణీ చేసినట్లు పూజారి శ్రీకాంత్ తెలిపారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి అందించిన అయోధ్య అక్షితలను స్థానిక నాయకులు ఇంటింటికి పంపిణీ చేశారు. ఉదయనగర్ కాలనీలో కౌన్సిలర్ లక్ష్మణ్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాముల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ అక్షితలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ, నారాయణగౌడ్, వెంకటేశ్, పెంటయ్య, మనోహర్, శివలింగం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: అక్షితలు అందిస్తున్న నాయకులు

రద్దీవేళల్లో ప్రత్యేక బస్సులు నడపాలి: ఏబీవీపీ



మాట్లాడుతున్న సూర్య ప్రకాశ్

ఇబ్రహీంపట్నం: రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులు నడిపించాలని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సూర్య ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తమ స్వార్థం కోసం స్కీంలను పెట్టి సామాన్య ప్రజలకు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించేందుకు నిత్యం బస్సుల్లో ప్రయాణిస్తుంటారన్నారు. బస్సులు రద్దీగా మారడం, సకాలంలో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. విద్యాలయాలు అధికంగా ఉండే రూట్లలో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేకంగా బస్సులను నడిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు సంజీవరెడ్డి, జగదీశ్, మహేందర్, హరీష్ పాల్గొన్నారు.

దత్తాత్రేయ కాలనీ కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులను సన్మానించిన కాలనీవాసులు

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులు ఉపేందర్, సైదులు తెలిపారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా డి.రమేష్, ఉపాధ్యక్షుడిగా టి.శోభన్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారని చెప్పారు. నూతన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ... కాలనీలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాలనీవాసులందరినీ సమన్వయం చేసుకుంటూ పోయి సమస్యలను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కిరణ్‌కుమార్, ఎం.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనర్హులు రేషన్ కార్డు రద్దు చేసుకోవాలి

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో మంగళవారం 15,16,17,18 డివిజన్లకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. దీనికి డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హాజరై దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రభుత్వం అందచేయాలనుకుంటున్న తెల్లరేషన్ కార్డులు.. అవసరం లేనివారు వదులుకోవాలని కోరారు. ఆర్థికంగా బాగా ఉన్న వారు తెల్ల రేషన్‌కార్డును రద్దు చేసుకుంటే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పేదల గురించి ఆలోచించే నాయకులు, ధనవంతులు తెల్ల రేషన్ కార్డును వదులుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరిజైహింద్, డీఈఈ జ్యోతిరెడ్డి, బాలాపూర్ వాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇబ్రాంశేఖర్

మురుగుకు అడ్డుకట్టేదీ?



ఎన్జీవోస్ కాలనీలోని లేబర్ అడ్డా వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు

- నిత్యం రోడ్లపై పారుతున్న మురుగు
- సమస్య పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం
- దుర్గంధంతో జనం అవస్థలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద నిత్యం మురుగునీరు రోడ్లపైకి రావడం వల్ల కాలనీవాసులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకోకపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయకపోవడంతో మట్టి పేరుకపోయి మురుగునీరు ప్రతి రోజూ రోడ్లపై పారుతోంది. వాటర్ వర్క్స్ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోని కారణంగా నిత్యం అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులే కాకుండా నిత్యం వందల సంఖ్యలో వివిధ పనుల కోసం వచ్చి అక్కడ నిల్చునే కార్మికులు సైతం దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితం అవుతున్నారని, క్షేత్ర స్థాయిలో సమస్యలపై ఆరా తీయకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు రోడ్లపై మురుగునీరు పారకుండా వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



యాచారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యాచారం: ప్రజాపాలనలో భాగంగా మంగళవారం యాచారం మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు ధరఖాస్తులు స్వీకరించారు. మాల్‌లో తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, చౌదర్‌పల్లిలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పలు గ్రామాల్లో ఆయా శాఖల అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

తుర్కయంజాల్: రెండు రోజుల పాటు సెలవుల కారణంగా నిలిచిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మంగళవారం పునఃప్రారంభమైంది. పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డులో ఏర్పాటు చేసిన కౌంటర్‌ల వద్ద మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులను స్వీకరించారు. అభయహస్తం ఆరు గ్యారంటీల ద్వారా పేదలందరికి న్యాయం చేకూరుతుందని కౌన్సిలర్ మేతరి అనురాధ, మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్ అన్నారు. రాగన్నగూడలోని లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

తలకొండపల్లి: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని చీపునుంతల, వెంకటాపూర్ తండా, జూలపల్లి, పూల్‌సింగ్ తండా, వెంకటాపూర్ తండా, గడ్డమీది తండాలో మంగళవారం ప్రజాపాలనలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. వెంకటాపూర్ తండాలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలో 12,365 గృహాలు ఉండగా ఇప్పటివరకు 8,621 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీఓ రఘు, ఏఓ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. శెట్టిపల్లిలో మంగళవారం సర్పంచ్ గోదాదేవి సత్యం, సింగంపల్లిలో సర్పంచ్ ప్రేమలత అధ్యక్షతన దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్, ఎంపీఓ శ్రీలత, ఏఈఓలు కృష్ణయ్య, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తామన్నారు. ప్రజాపాలన గ్రామసభలో ప్రజలు అభయహస్తం దరఖాస్తులను అందించాలని.. అర్హులను గుర్తించి అందరికీ పథకాలు అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసీల్దార్ అన్వర్ పరిశీలించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. సర్పంచ్ గీతారాంరెడ్డి, ఉపసర్పంచ్ నరేందర్, ఎంపీటీసీ అంజనేయులు, వ్యవసాయ శాఖ ఏఓ వరప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేస్తాం..

ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ రాజు, నాయకులు సాయిబాబాగౌడ్, వెంకటయ్య, నర్సింహ, అధికారులు పాల్గొన్నారు.

మంచాల మండలంలో..

మంచాల: మండలంలోని బండలేమూర్, చెన్నారెడ్డిగూడ, ఆగాపల్లి, కాగజ్‌ఘాట్, తిప్పాయిగూడ, చిత్తాపూర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలను ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. చేసుకోవాలన్నారు. అభయహస్తం దరఖాస్తులను అందుబాటులో ఉంచామని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మంగ, కిషన్‌నాయక్, పరంగీ, జంగయ్య, ఆండాలు, పాండు, నాగరాజ్ గౌడ్, వెంకటేశ్, మధుసూధన్‌రెడ్డి, సుకన్య, ఎంపీఓ తేజ్‌సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ఆమనగల్లు: దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ గోదాదేవి సత్యం